# బైబిలు యొక్క విశేష లక్షణాలు

బైబిలు యొక్క కొన్ని విశేష లక్షణాలు సుప్రసిద్ధమైనవై దైవికమైన మూలాన్ని సూచిస్తాయి. ఈ విశేష లక్షణాలను యింతకు ముందుగానే క్లుప్తంగా ప్రస్తావించినా, ఎక్కువగా పరిశీలించడానికి అవి పాత్రమై లేక యోగ్యమైయున్నాయి.

## భిన్నత్వం మధ్య దాని ఏకత్వం

ప్రధానంగా కన్పించే బైబిలు యొక్క విశేష గుణ లక్షణాలలో ఒకటి –ఎంతో అధికము గానున్న భిన్నత్వంలో దాని ఏకత్వం. బైబిలు నిర్మాణాన్ని గూర్చి ఆలోచించు: దాదాపు నలభై మందిచే వ్రాయబడిన అరవైయ్యారు రచనలతో అది కూడి ఉంది. ఎక్కువమంది ఒకరికొకరు ఎరుగని వారు – మూడు భాషల్లో – పదిహేను వందల సంవత్సరాల కాలంలో వ్రాయబడింది. ఈ లేఖకులు ఆయా స్థలాల్లో, వివిధ ప్రభుత్వాల క్రింద (అష్షూరు, బబులోను, మాదీయ – పారసీక, గ్రీకు, మరియు రోమా) జీవించినవారు.

పలువురైన ఈ మనుష్యుల రచనలను ఒకచోట చేర్చినప్పుడు, వాటి ఏకత్వము ఊహాతీతమైయుంది. ఒకే గొప్ప మనస్సు ఈ రచనను సంధానము చేస్తున్నట్లు బైబిలు లోని చర్చనీయాంశాలు, వాస్తవాలు, సూత్రాలు సూచిస్తున్నాయి. ఈ విశేష రచనల సేకరింపులో ఏకత్వానికిగల ఉదాహరణలను చూద్దాం.

### యేసు

ప్రవచన సారం యేసును గూర్చిన సాక్ష్యం గనుక లేఖనముల ప్రధానమైన ఏకత్వం యేసే (ప్రకటన 19:10సి). బైబిలులోని ప్రతి రచనయు గలిలయ మనుష్యునితోను, నరులతో ఆయనకున్న బాంధవ్యంతోను సంబంధం కలిగియుంది. సమస్తము తన కుమారునియందు ఏకముగా సమకూర్చాలనేది తండ్రి అభీష్టం (ఎఫెసీ. 1:10). ఒక వ్యక్తి యేసును గూర్చి ఇలా వ్రాశాడు:

> ఆదికాండంలో ఆయన షిలోహుగా ప్రవచింపబడినట్టు నేను చూస్తాను. నిర్గమకాండంలో, పస్కా పశువుగా. లేవీయకాండంలో విడిచిపెట్టు మేకగా. కీర్తనల్లో, కాపరిగా. పరమగీతంలో, షారోను పుష్పము, లోయలోని వల్లిపద్మము, పదివేలలో అతి ప్రియునిగా. యోబులో, మధ్యస్థుడుగా. యెషయాలో బాధననుభవించు సేవకునిగా.

దానియేలులో, పరిశుద్ధుడగు వానిగా. యిర్మీయాలో, చిగురుగా. మత్తయిలో, మెస్సీయాగా. మార్కులో, అద్భుతాలు చేయువానిగా. లూకాలో క్రీస్తుగా. యోహానులో, వాక్యముగా. అపొస్తలుల కార్యాలలో, జీవాధిపతిగా. రోమాలో, విడిపించువాడుగా. మొదటి కొరింథీలో, దేవుని జ్ఞానముగా. కొలస్సీలో, సర్వసృష్టికి ఆది సంభూతుడుగా. మొదటి పేతురులో, ప్రధాన కాపరిగా. ప్రకటనలో, అల్ఫయు ఓమేగయుగా.[1]

## మతాల అభ్యుదయం

బైబిలు ఏకత్వానికి మరొక ఉదాహరణ–నరులతో దేవుని సంబంధ వ్యవహారం మతాభ్యుదయాన్ని సూచిస్తుంది: మొదటిగా పితరులకు సంబంధించిన, తదుపరి యూదా మతం, మరియు కడసారిగా క్రైస్తవ్యం. ఈ మూడు యుగాలలో కుటుంబ మతం, జాతీయ మతం, అంతర్జాతీయ మతం చుట్టబడి ఉన్నాయి. బయలుపరచబడిన మతం యొక్క స్పష్టమైన, సంపూర్ణమైన ఉద్దేశాన్నంతా ఒకే చిత్రంగా యిస్తూ ఈ మత విధానాల తార్కిక, వాతావరణ పురోభివృద్ధి పాత, క్రొత్త నిబంధనలలో వ్రాయబడియుంది.

## మాదిరులు మరియు సాదృశ్యాలు

పవిత్ర లేఖనాల్లోని ఏకత్వానికి ప్రధాన ఉదాహరణ మాదిరులు మరియు సాదృశ్యాలు అనేవాటిలో కన్పిస్తుంది. పాత నిబంధన సంగతులకు క్రొత్త నిబంధన వర్తింపులున్నాయి. కలలోని నిచ్చెన యేసుకు సాదృశ్యంగా ఉంది. మోషేచే నిర్మించబడిన మోసికొని పోబడే ఆకృతి, మానవ హస్త నిర్మితం కాని ఆత్మ సంబంధమైన గుడారముందని సూచించుతుంది. మన్నా అని పిలువబడి పరలోకమునుండి కురిపింపబడిన ఆహార వస్తువు, యేసును సూచించింది. ఎర్ర సముద్రాన్ని దాటడం క్రొత్త నిబంధన బాప్తిస్మపు మాదిరియై ఉంది (1 కొరింథీ. 10:2). భార్య, దాసి మరియు వారి పిల్లలు రెండు మతముల వివరణకు దృష్టాంతములుగా ఉన్నాయి (గలతీ. 4:22–26). రాజుగాను యాజకుడుగాను ఉండే క్రీస్తు యొక్క పాత్రకు రాజుగానున్న యాజకుడు నీడయైయున్నాడు. మాదిరి, సాదృశ్యాలు, నీడ, నిజ స్వరూపాలు ఏకత్వానికి ఎంత సన్నిహితంగా ఉన్నాయంటే–పాత నిబంధనను "క్రొత్త నిబంధన గుప్తమైనదిగానూ," క్రొత్త నిబంధనను "పాత నిబంధన బయలుపరచినది" గానూ పిలువడం జరిగింది.

## సంపూర్తి చేయబడిన కథలు

బైబిల్లోని ఒక భాగంలో ఆరంభమైన కథలు, కొంత కాలంవరకు సంపూర్తి చేయకుండ విడువబడినవి, చివరి పుస్తకంలో ముగింపుకు తేబడ్డాయి. దైవికమైన రికార్డు యొక్క ఆరంభంలో ప్రస్తావించబడిన జీవవృక్షం కథ, ప్రకటనలో యోహానుచేత ముగించబడింది. మొదటి తల్లితో ఆరంభమైన వేదన, కన్నీటిని గూర్చిన కథ, ప్రతి కన్నీటి బిందువును తుడిచివేయును అనే దానితో శిఖరాగ్రం చేరుకుంటుంది. తొలి పాపముతో ఆరంభమైన శాపముయొక్క కథ, "ఇక మీదట శాపగ్రస్తమైనదేదియు దానిలో ఉండదు" అనే దానితో సంపూర్తియౌతుంది (ప్రకటన 22:3). ఆదాము హవ్వలు ఏదెనులోనుండి తోలివేయబడిన పిమ్మట ఆరంభమయిన బలుల కథ, ప్రకటన గ్రంథంలోని యూదా గోత్రపు సింహము,

వధింపబడిన గొర్రెపిల్లగా చూడడంతో, కథ పులకరింపజేయు శిఖరాగ్రాన్ని చేరుకుంది (ప్రకటన 5:6).

**పోలికలు**

పలురకాలైన కలాలనుండి, పరిస్థితులనుండి వచ్చిన వాటిని చూచినప్పుడు వర్ణింప బడిన ఏకత్వము స్పష్టంగా గోచరమౌతుంది. అనేకమంది రచయితలనుండి మూడు భాషలలో పదిహేను వందల సంవత్సరాలకు చెందిన పుస్తకాలను ఒకడు ఏరుకున్నట్టయితే, వాటిలో ఆలోచనాధారన్నేదైనా చూస్తే, ఆశ్చర్యపడిపోతాడు. ప్రాచీన గ్రీకు రచనలను ఒకే గ్రథంగా చేసినా, సంపుటంగా చేసి చూస్తే గ్రీకు రచయితలనే సాధారణ గ్రంథ కర్తృత్వంలో తప్ప మరి దేనిలోను ఏకత్వం ఉండదు.

బైబిలును యితర మత గ్రంథాలతో పోల్చినను, విభిన్నత్వంలో ప్రధానంగా కన్పించే బైబిలు ఏకత్వాన్ని నొక్కి చెప్పడానికే పనికి వస్తుంది. బైబిలు కాని మత గ్రంథాలలో ఎక్కువ ఏకత్వాన్ని కనుగొనలేం. పవిత్ర గ్రంథాలుగా పరిగణింపబడే మహమ్మదీయుల, జొరాష్ట్రియనుల, బౌద్ధుల రచనలలో "ఏకత్వం లేదు. హెచ్చు తగ్గులుగా విషయాలను సమకూర్చి, ప్రకటించడంలో ... క్రమముగాని, అభివృద్ధిగాని, ప్లానుగాని లేదు."[2]

నలభైమంది శిల్పులు (ఒకనినొకడు ఎరుగని అనేకులు) నిశిత ప్రణాళిక లేకుండ, ఒక శిల్పం యొక్క రూపంలో భాగాలను చెక్కినా, రమ్యమైన ఫలితాలను పొందడం అసాధ్యం. అలాగే, అందరిపై ఒక సమన్వయ కర్త లేకుండ నలభైమంది చిత్ర లేఖకులు ఒక పటంలోని భాగాలను గీస్తే దాన్ని అగ్రగణ్యమైందిగా చెప్పుకొనను వీలుపడదు. పజల్ (చిక్కు చిత్రపు) భాగాలను, ఒక వ్యక్తి పరిశీలన లేకుండా కత్తిరిస్తే, ఒక దానితో ఒకటి సరిపోవు. సొలొమోను దినాల్లో, సుత్తె, గొడ్డలి మొదలైన యినుప పనిముట్లు ధ్వని యెంత మాత్రమును వినబడకుండ ముందు ప్లాను, కొలతల ప్రకారం చెక్కబడిన రాళ్లు ఆకర్షణీయమైన దేవాలయ నిర్మాణంలో అతికించబడ్డాయి (1 రాజులు 6:7). బైబిలు అని పిలువబడే ఉత్తమ గ్రంథం యొక్క పొందికను సమకూర్చడానికి పర్యవేక్షకుని యొక్క అవసరం ఉండాలని ఈ పోలికలు నొక్కి పలుకుతున్నాయి. అనేకమందిచే జరిగిన సంగీత ప్రదర్శన ప్రణాళికను, మొత్తపు పరిశీలనను డిమాండ్ చేస్తుంది, బైబిలు యొక్క పొందిక, ఏకత్వం అనేవి దానికంటే ఏ తక్కువైన దానిని డిమాండ్ చేయదు.

## దాని సరళత్వము, గాఢత

బైబిలు మానవాతీతమైన మూలము కలిగియున్నదని సూచించే రెండవ లక్షణము గాఢమైన భావంతో కూడిన సరళత. యోసేపు, దావీదు, యేసు అనే బైబిలు వ్యక్తుల కథలు స్పష్టంగా మెరుస్తున్నట్టు ఉన్నాయి. మాటి మాటికి వాటిని పఠించడంవలన యౌవనుల యొక్కయు, అనుభవజ్ఞుల యొక్కయు దృష్టిని అవి ఆకట్టుకుంటాయి. అదే సమయంలో, ఉత్తమమైన ఆలోచనలు కలిగినవారు పదే పదే చర్చించేలా బైబిలు ప్రతిపాదనలు వారికి ఆలోచనలు కలిగిస్తాయి. రక్షణ సంకల్పం ఎంత తేలికగా ఉందంటే, ఎవడైనా దాన్ని అర్థం చేసికోలేదనడానికి కారణమే ఉండదు (యెషయా 35:8; ఎఫెసీ. 5:17); అదే

సమయంలో, భవిష్యత్తును గూర్చిన యోహాను దర్శనములను ఏ నరుడును సంపూర్ణంగా అర్థం చేసికోలేదు. "దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము ..." (రోమా 11:33). యూదులు, అన్యజనులు ఒలీవ చెట్టులో అంటుగట్ట బడడం అనే భావన ఉత్తమ మనస్సులచే మరల మరల పరిశీలించేలా చేసింది (రోమా 11:16-24).

ఇది క్రమంగా లేని గ్రంథం, మరియు దాని చట్టములు లేక శాసనములు ఒక చోట క్రమ పద్ధతిని ఏర్పరచలేదు; అయినా, భక్తికి, మంచితనానికి, తప్పులేమికి, దయకు హృదయాలమీద కావించిన ప్రభావానికి ఎలాటి దోషం లేదు. అనేక బాధ్యతలను అది ఆజ్ఞాపించినా, దేవుని, నరుని ప్రేమించాలనే గొప్ప సూత్రంమీదనే దాని దృష్టి కేంద్రీకరించ బడుతుంది. ఒకే గ్రంథం బిడ్డ యొక్కయు, తండ్రి యొక్కయు అభినందనలను పొందు తుందనే వాస్తవం మానవునికంటె అతీతమైన మూలాన్ని అది సూచిస్తుంది.

## దాని నిష్పక్షపాతత

బైబిలు యొక్క దైవికమైన కర్తృత్వాన్ని సూచించే మూడవ లక్షణం దాని ప్రధాన పాత్రలను నిష్పక్షపాతంగా చిత్రించడమే. సహజంగా జీవిత చరిత్రను వ్రాసేవారు తమ కథా నాయకులను పొగిడి, వారి తప్పులను ఎత్తి చూపకుండా లేక వారి స్వభావ లోపాలను ఒత్తి చెప్పి, వారి కథా విషయాన్ని వక్రీకరిస్తారు. ఏదియేలాగున్నా, బైబిల్లో మాత్రం పొగడ్తో, నిర్దోషిగా నిర్ణయించడమో జరుగలేదు. సాధారణంగా పాఠకుడే చర్చలోని వ్యక్తి యొక్క అర్హతానర్హతలను అంచనా వేస్తాడు.

నోవహు యొక్క మెచ్చుకోదగిన లక్షణాలను ఒకవైపు చూపి, తరువాత త్రాగిన మత్తులో పడియున్న స్థితిని వర్ణించడం ఒక విధంగా వింతగానే ఉంటుంది. ఆదర్శమైన పత్రికా విలేఖరులవలె, దావీదు యొక్క గుణాతిశయములను, అతని పాపములను సహా వర్ణించారు. అబ్రాహాము యొక్క గాఢమైన విశ్వాసాన్ని లేఖనాలు వర్ణిస్తాయి, ఫరోవద్ద అతడు తప్పుగా చెప్పిన సంగతిని కూడా వర్ణిస్తాయి. సువార్త లేఖకులు పేతురు విషయంలో బలమైన ఆలోచనలు కలిగియుండవచ్చు, అయితే ప్రభువుపట్ల అతనికున్న భక్తిని, ఆయనను ఎరుగనని అతడు చెప్పిన సంగతిని గూర్చి వారు కేవలం నిష్కళంకమైన వాస్తవాలను తెలిపారు. క్రీస్తు ప్రభువుకు తమను తాము ఎలా సమర్పించుకున్నారో అనే విషయాలతో పాటు యాకోబు, యోహానులకున్న వ్యక్తిగతమైన అభ్యుదయేచ్ఛలను అంతే స్పష్టంగా వర్ణించారు.

తమకు స్వంత అభిప్రాయాలు ఉన్నప్పటికీ తమకు పక్షపాతమనేది లేనట్టు ఎవ్వరిపై ప్రత్యేకతను చూపలేదు. ఎవరినీ ఉద్దేశించని వారి (వ్యక్త నిరపేక్ష) సామర్థ్యం ఇతర జీవిత చరిత్రల రచయితల కంటె ఉత్తములనుగా నిరూపిస్తూ, దైవికమైన నడిపింపును సూచించుతుంది.

## దాని సంక్షిప్తత

బైబిలు యొక్క దైవికమైన కర్తృత్వాన్ని సూచించే మరొక గుణ లక్షణం దాని సంక్షిప్తతలో ఉంది. సంక్షిప్తంగా ఉండడానికి కేవలం మానవులుగా రచయితలు పోరాటం సాగించుతునే

ఉన్నారు. ఈ విషయంలో పవిత్ర గ్రంథపు లేఖకులు ఎక్కువ గౌరవాన్ని చూరగొన్నారు. ఒక బంతి ఆటను గురించి వార్తా పత్రిక విలేఖరులు నివేదించే పదాలకంటే తక్కువ పదాల్లో – 34 వచనాల్లో విశ్వం యొక్క సృష్టి స్పష్టంగా చిత్రీకరింపబడింది. కనీసం ఇరవైయయిదు వందల సంవత్సరాల మానవ చరిత్ర కేవలం ఒక పుస్తకంలోనే, ఆదికాండంలోని యాభై అధ్యాయాలలో దాఖలు చేయబడింది.

యేసు బాప్తిస్మాన్ని గూర్చిన వివరణకు అయిదు వచనాలు, సముద్రాన్ని నిమ్మళింప జేసిన దానికి అయిదు వచనాలు పట్టాయి. రూపాంతరం ఎనిమిది వచనాల్లో వర్ణించ బడింది, యేసు మరణ విశేషాలకు రెండే అధ్యాయాలు పట్టాయి. యేసు పరిచర్య యొక్క పన్నెండు వందల దినాలు, ముప్పైనాలుగు దినాల సంఘటనల్లో కుదించబడ్డాయి. స్తెఫను, ఒకే అధ్యాయంలో, దాదాపు రెండువేల సంవత్సరాల చరిత్రను యిమిడ్చాడు. తొలి అపొస్తలుని యొక్క మరణము KJVలో కేవలం పదకొండు పదాల్లో దాఖలు చేయబడింది (అపొ. 12:2).

ఈలాటి కథనాల్లో ఎక్కువ పదాలను ఉపయోగించడం మానవ స్వభావం. అలాటి మిక్కిలి ముఖ్యమైన సంఘటనలను చెప్పడంలో కట్టుబాటును కనుపరచి సంగ్రహించడం కష్టం. బైబిలు వచనాన్ని తక్కువ మాటలతో చెప్పి, దాని భావాన్ని చెరపకుండ ఉంచాలనే సవాలు అంగీకరించబడలేదు. విషయాన్ని తగ్గించకుండ, మాటలను తగ్గించడంలో బైబిలు లేఖకులు సాధించిన విజయం మానవాతీతమైన సహాయాన్ని సూచిస్తుంది.

## దాని కట్టుబాటు

బైబిలు లేఖకులు హద్దుల్లో నిలిచియుండడం జనులను ఆశ్చర్య చకితులను చేసింది. బైబిలు ఒక ప్రత్యేకమైన ఉద్దేశం కొరకు వ్రాయబడింది, ఆ ఉద్దేశము మానవ కుతూహలాన్ని తీర్చడం కాదు. వారు సామాన్య లేఖకులైయున్నట్టయితే, కయీను యొక్క భార్య ఎవరో, మోషే పాతిపెట్టబడిన స్థలమెక్కడో, యేసు జీవితంలో పదునెనిమిది సంవత్సరాల నిశబ్ద కాలం ఏమైయుందో, యోహాను 8:6, 8లో ఆయన నేలమీద వ్రాసిన మాటలేమో, లాజరు చనిపోయి ఉన్న ఆ నాలుగు దినాల్లోని అనుభవం ఏమైయుందో, పరదైసుకు వెళ్లిన పౌలు ప్రయాణ విశేషాలేవో ఆ పవిత్ర గ్రంథ లేఖకులు వ్రాసియుండేవారే. ఆ సంఘటనల యొక్క వివరాలు లభ్యమైనట్టయితే, ఆలస్యమైన నేడైనా సరే, వారు వార్తా పత్రికల ముఖ్యాంశాలుగా చేసుకొని యుండేవారే; విరివిగా అమ్మబడే పుస్తకాలు ప్రచురింపబడియుండేవే. "జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని" యివ్వడమే వారి ఉద్దేశమైనందున దానికేవారు కట్టుబడి తమ్మును తాము హద్దుల్లో పెట్టుకొని ఉన్నారు (2 పేతురు 1:3). మానవ కుతూహలానికి దోహదం చేయకపోవడంవల్ల బైబిలు దాని స్థానంలో నిలిచింది.

## దాని సాహిత్య గుణాతిశయం

బైబిలు మానవాతీతమైన మూలంనుండి కలిగిందనడానికి బైబిలు లేఖకుల సాహిత్య గుణాతిశయం రుజువుగా సూచిస్తుంది. దైవత్వానికి సంబంధించిన దాని నిరూపణలను

ప్రక్కనుంచి, సాహిత్య రచనను ఆలోచించినప్పుడు, బైబిలు ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తుంది. "భాషా ప్రయోగాలను వినియోగించడంలో హెబ్రీ ప్రవక్తలు కనుపరచిన బుద్ధి కుశలత" ఆ కాలంలోని "బబులోనులో గాని, ఐగుప్తులో గాని, మరి ఎక్కడ ఉన్న కవులలోనైనా వారికి అధిక స్థానాన్ని యిస్తుంది" అని ఒక పండితుడన్నాడు. "అదే రకమైన నాగరికతల్లో సమాంతరమైన మాదిరులలో యోబు గ్రంథము హెచ్చు స్థాయిలో నిలుస్తుంది."

క్రొత్త నిబంధన నియమములోనైతే, లూకా, పౌలులు తప్ప, మిగిలిన లేఖకులు విద్యలేని పామరులన్నట్టు గోచరిస్తారు (అపో. 4:13 చూడు). అలాటి మనుష్యులు పుస్తకాలు వ్రాయడమంటే, అదే ఆశ్చర్యం. జీవితమంతా తమ పనిలో నిమగ్నమైన జాలరులు గొప్ప తప్పులు చేయకుండా ఏదైనా వ్రాయగలరా? అయితే ఈ బైబిలు లేఖకులు స్వయం ఆజ్ఞ మరియు స్వయం క్రమశిక్షణను కనుపరచి మర్యాదను నిలబెట్టుకొనడంలో కొనసాగారు. సాహిత్య గుణాతిశయము బైబిలు యొక్క దైవ మూలాన్ని రుజువు చేయదు గాని, దేని మూలము పరలోకమైయుందో అలాటి గ్రంథానికి యిలాటి గుణము ఉండాలని ఆశిస్తుంది.

## దాని పరిపూర్ణత

సంపూర్ణ నియమమని క్రొత్త నిబంధన చెప్పుకొంటుంది (యాకోబు 1:25), రెండువేల సంవత్సరాల తరువాత కూడా దాని నిరూపణ కాంతిహీనం కాకయే నిలిచియుంది. దాని బోధలననుసరించి జీవించేవారికి లోపించినట్టు ఏదీ కన్పించదు, దానిని సరిదిద్ద వలసినది కూడా ఏమీలేదు.

మానవ మూలమైనది ఏదైనా సరే, వృద్ధి చేయబడగలదు. అమెరికా స్కూలు బుక్స్‌లో *McGuffey's Reader* and *Ray's Blueback Speller* వంటి వాటిలో కూడా ఇంప్రూవ్ మెంట్స్ ఎప్పుడో చేయబడ్డాదు; ఆ టెక్స్‌ట్ బుక్స్ తీసివేయబడ్డాయి. ఒక తరమునకు ముందు రసాయన శాస్త్ర పుస్తకాలు, "ఆటమ్" అంటే విడదీయబడనిదని, మూల పదార్థాలు మార్పులు జరుగరాదనేది ఆల్‌కెమిస్ట్స్ యొక్క కోర్కెయై ఉండింది. ఇప్పుడు ఆ కెమిస్ట్రీ పుస్తకాలు మ్యూజియమ్ వస్తువులుగానే పనికి వస్తాయి.

తరము వెంట తరము గతించుతునే ఉంది, బైబిలు మార్పులేనిదైయుంది. సవరించి ప్రకటించుటకు అవసరంలేనిదైయుంది. బైబిలు కంటె ఎక్కువగా తెలిసికోవాలని అనేకులు భ్రమించారు, కాని వారి క్రొత్త బోధలు – తప్పిపోకుండ బైబిలు సాధించగలిగింది – సాధించలేవు. బైబిలు మానవ మూలమునుండి కలిగినదేయని అనుకున్నట్టయితే, మాడిఫికేషన్స్ (మార్పులు) అవసరం లేని, ఆధునికం చేయనవసరంలేని ఏ మానవ రచనకైనా అదే తొలి ఉదాహరణగా ఉండేదే.

మత విశ్వాస (క్రీడ్) పుస్తకాలు, బైబిలు మీద అధారపడి, పండితులచే వ్రాయబడినా, మరల మరల సవరించి ప్రచురించవలసినదే. పరిశుద్ధాత్మచే ప్రేరేపింపబడిన మనుష్యులచే వ్రాయబడనందున అలాటి దిద్దుబాటు ఎదురు చూడవలసియుంటుంది. ప్రతి దేశంలోను, ప్రతి తరంలోను బైబిలు తన నవ్యతను, ప్రతిష్ఠతను ఏ సవరింపులు లేకుండానే నిలుపు కొంటున్నందున తన్ను తాను ఏకైకమైనదిగా చేసుకొంటూ, వివరణ కోరుతుంది.

## దాని అవినాశత

బైబిలుకు ఉన్న మానవాతీతమైన సంరక్షణను సూచించే చరిత్రను ఆలోచించు: శతాబ్దములనుంచి కొల్లగొట్టడం లేక పాడుచేయడం ఒక ప్రక్క ఉన్నా, అగ్ని పరీక్షలు మరో ప్రక్కనుండి జరిగినా, అది అలాగే నిలిచియుండే అమోఘమైన సామర్థ్యం కలిగియుంది. గ్రంథాలు పరీక్షలకు లోనుకాకున్నా, తన తరం దాటి మరో తరంలో సజీవంగా కొద్ది శాతం మాత్రమే మిగిలి ఉంటుంది. బైబిలైతే వింతగా ప్రతి తరానికి నవ్యతను లేక క్రొత్త తనాన్ని, ప్రస్తుతాన్వయాన్ని లేక సంబంధమును కలిగియుంటుంది.

బైబిలును రూపొందించిన దేశమే యితర పుస్తకాలను సహా రూపొందించింది, అయితే అవి సజీవంగా లేవు. పాత నిబంధన వాటిని సూచిస్తుంది గనుక వాటిని గూర్చి తెలియ వస్తుంది (సంఖ్యా. 21:14; యెహోషువ 10:13 లను చూడు). దైవ ప్రేరేపితము కాని యూదుల గ్రంథాలు ఆయా కాలాల్లో ఉన్నాయంటే, బైబిలు మతంతో వాటికి సంబంధముంది గనుకనే. ఒకతను యిలా వ్రాశాడు:

> కైసరు సామ్రాజ్యం గతించిపోయింది; రోమా సైన్యాలు బూడిదెలో పొగ రాజుతున్నాయి; ఐరోపా మీద నెపోలియన్ విసిరిన కూలెడు మంచుగడ్డలు కరిగి పోయాయి; ఫరోల యొక్క అధిపతి పడిపోయాడు; వారి సమాధులు పైకెత్తబడిన పిరమిడ్లు ప్రతి దినము ఎడారి యిసుకతో పూడిపోతున్నాయి; తూరు యొక్క బండ జాలరుల వలలు బాగుచేసికొనడానికి ఉంది, అయితే దేవుని వాక్యము యింకను సజీవంగానే ఉంది. దానిని ఆర్పి వేయడానికి భయపెట్టినవన్నీ, దానికి సహాయపడ్డాయి. మానవుల గంభీరమైన జ్ఞాపక చిహ్నాలు ఎంతటి అస్థిరమైనవో, దేవుడు పలికిన అత్యల్పమైన పదము కూడా ఎంత నిలకడగా ఉంటుందో అనుదినము అది రుజువు చేస్తుంది.[3]

దేశాలు లేస్తాయి పడిపోతాయి, కాని బైబిలు మాత్రం నిలిచే ఉంటుంది. పౌలును చంపడంలో నీరో విజయం సాధించాడు; అయితే నీరోయు, అతని సామ్రాజ్యమును మృతిచెందాయి. రోములో పౌలు ఉంచబడిన చెరసాల ఉనికిలో లేకుండానే పోయింది కాని, పౌలు చెరకు సంబంధించిన పత్రికలు సజీవంగానూ, చైతన్య పూరితంగానూ ఉన్నాయి.

క్రీ.శ. 303లో, లేఖనముల ప్రతులన్నిటిని లయపరచడానికి చక్రవర్తియైన డయోక్లేషియన్ ఆజ్ఞ జారీచేశాడు. తన సైనికులును, విచారణ జరిగించేవారును విజయం సాధించినట్టు అతడు తలంచాడు, తాను సాధించినట్టు భావించిన విజయాన్ని ఉత్సవంగా జరుపుకునేటప్పుడు, ఒక మెడల్ మీద ఈ మాటలు చెక్కించుకున్నాడు: "**క్రైస్తవ మతము నిర్మూలించబడింది, మరియు దేవతల పూజ పునరుద్ధరింపబడింది.**" అప్పుడు, బైబిళ్లు ఎక్కడ కాల్చబడ్డవో, అక్కడ "**క్రైస్తవులనే పేరు అంతరించింది**" అనే ఒక జ్ఞాపక చిహ్నాన్ని నిలిపాడు. అతని ప్రయాస ఎంతగా జరిగినా, లేఖనాల ప్రతులు తిరిగి ప్రత్యక్షమై విస్తరించాయి. ఇరవై సంవత్సరాల తరువాత కాన్ స్టాంటైన్ అనే మరొక రోమా చక్రవర్తి, సామ్రాజ్యంలోని ప్రతి సంఘంలో బైబిలు ప్రతులను నిలిపాడు. బైబిలు లయము కానిదని చెప్పుకొంటుంది (1 పేతురు 1:23). బైబిలు రోమా సామ్రాజ్యం మీద సాధించిన ఘన విజయం బైబిలు చెప్పుకొన్నది (క్లెయిం) కేవలం అతిశయం కాదని నిరూపిస్తుంది.

లేఖనములపై చూపిన భౌతికమైన ఆగ్రహంతోపాటు, బైబిలు శాశ్వతమైనదనే నిరూపణలను అపకీర్తిపాలుచేయడానికి అవిశ్వాసులు లెక్కలేనన్ని ప్రయత్నాలు చేశారు (యెషయా 40:3; మత్తయి 24:35; మార్కు 13:31; లూకా 21:33). 1778లో చనిపోయిన వాల్టేర్ బైబిలుకు వ్యతిరేకంగా నిలిచి, వంద సంవత్సరాల్లో బైబిలు మరువబడుతుందని ప్రవచించాడు. "క్రైస్తవ్యాన్ని ఆరంభించడానికి పన్నెండు మంది కావలసివచ్చింది, ఒక్కడే దాన్ని నాశనం చేస్తాడు" అని అతడు గప్పాలు కొట్టాడు. ఏదియేలాగున్నా, అతడు మరణించిన వెంటనే, బ్రిటిష్ అండ్ ఫారిన్ బైబిల్ సొసైటీ ఏర్పడింది; వాల్టేరు వ్రాత గదిని బైబిల్లు నిలువచేసే గదిగా చేయబడింది. వాల్టేరు అవిశ్వాస సాహిత్యాన్ని ముద్రించడానికి ఉపయోగించిన ప్రెస్ బైబిలు ప్రతుల ముద్రణకు ఉపయోగింపబడింది!

1809లో చనిపోయిన థామస్ పైన్ – ఏజ్ ఆఫ్ రీజన్ అనే ప్రఖ్యాతిగాంచిన తన రచన ద్వారా బైబిలును అహంకారంతో వ్యతిరేకించడానికి "ఏభై సంవత్సరాలలో బైబిలు పనికిరానిదై మరువబడుతుంది" అని అతడు ఆత్మ స్తుతి చేసికొన్నాడు. మరల, తన పుస్తకాన్ని ప్రింట్ చేసిన అదే ప్రెస్ వేలకొలది బైబిళ్లను ముద్రించడానికి వినియోగించబడింది.

బైబిలు ఎదుర్కొన్నంతగా ఏ యితర గ్రంథము వైరుధ్యాన్ని ఎదుర్కొని నిలిచియుండలేదు. "ఇంకను అది హింసింపబడి, బాధింపబడి, వక్రంగా తిప్పబడుతునే ఉంది, అది సజీవంగా నిలిచియుందంటే – ఆ ఘనత ఏది మన నవీన సాహిత్య కుతూహలం కలిగినవారివలన వచ్చింది కాదు." లేఖనములకు విరుద్ధంగా వచ్చిన విషపూరితమైన విజృంభణలకు అది కేవలం మానవ మూలమైనదైయుంటే ఆ గ్రంథం నిలిచియుండేది కాదు.

## ముగింపు

బైబిలు యొక్క మెచ్చుకొనదగిన లక్షణాలలో దాని ఏకత్వము, దాని సూక్ష్మ బుద్ధిగల సరళత్వము, దాని నిష్పక్షపాతత, దాని సంక్షిప్తత, దాని కట్టుబాటు, దాని సాహిత్య గుణాతిశయము, దాని పరిపూర్ణత, మరియు దాని అవినాశత అనేవి ఉన్నాయి. కొన్ని మానవ రచనలు ఈ ఎనిమిదింటిలో కొన్ని మహత్వ లక్షణాలను కలిగి ఉంటాయి, కాని ఒకే ఒక్క గ్రంథం ఈ ఎనిమిదింటిని కలిగి ఉంది. బైబిలుకు మానవుడు మూలం కాదనడానికి ఈ వాస్తవమే బలమైన రుజువైయుంది.

---

సూచనలు

[1]రచయిత తెలియదు. [2]James Orr, ed., "Bible," in *The International Standard Bible Encyclopedia* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1955) 1:467. [3]రచయిత తెలియదు.